క్లుప్తంగా

రహదారిపై భారీ వాహనాలు బంద్

అశ్వాపురం: కల్వర్టు నిర్మాణ పనుల దృష్ట్యా మండల పరిధిలోని మొండికుంట–సారపాక ప్రధాన రహదారిపై నేటి నుంచి ఈ నెల 29 వరకు భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సుల రాక పోకలు నిలిపివేస్తున్నట్లు ఆర్అండ్బీ ఏఈఈ ఎస్.వంశీవీరేంద్ర తెలిపారు. శనివారం ఆర్ అండ్బీ అధికారులు భద్రాచలం, మణుగూరు ఆర్టీసీ డిపో మేనేజర్లకు, బూర్గంపాడు పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామ శివారు అశ్వాపురం మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీలోని గరిఒడ్డు గ్రామం వద్ద రామచంద్రాపురం స్టేజీ సమీపంలో మొండికుంట–సారపాక ప్రధాన రహదారి వెంబడి కడియాలబుడ్డి వాగుపై ఆర్అండ్బీ శాఖ ఆధ్వర్యంలో కల్వర్టు నిర్మాణం పనులు చేపడుతుండటంతో రహదారి అధిక లోడుతో వెళ్లే వాహనాలు, భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు ప్రయాణించటం సాధ్యం కాదని, వారం రోజుల పాటు ఇతర మార్గాల్లో ప్రయాణం సాగించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు.

పేదల సమస్యలపై పోరాడుతాం

చండ్రుగొండ: ఫిబ్రవరి 5వ తేదీ నుంచి పేదల సమస్యలపై ఉధృతమైన పోరాటాలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు భారతీయ సర్వసమాజ్ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిశెట్టి సామేలు తెలిపారు. మండలంలోని అయన్నపాలెం గ్రామంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాద్ జిల్లా సంఘ్ ముఖ్యకార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. రాబోవు ప్రతి ఎన్నికల్లో సంఘ్ తరుపున అభ్యర్థులను బరిలో నిలుపుతామన్నారు. ఇళ్లులేనివారికి తక్షణమే ఇళ్ల నిర్మాణాలకు రూ. 5 లక్షలు నగదు ఇవ్వాలని, గ్రామాల్లో కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు కిన్నెర శేషు, భూక్యా రవి పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడి ఎన్నిక

దమ్మపేట: తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సూతకాని శ్యామ్కుమార్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం దమ్మపేట మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్గా పనిచేస్తున్న శ్యామ్కుమార్ను హైదారాబాద్లో జరిగిన సమావేశంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన శ్యామ్కుమార్ను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక చేయడం పట్ల దమ్మపేట గురుకుల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

కోడి పందేల స్థావరాలపై దాడి

దమ్మపేట: మండలంలోని రాచూరిపల్లి గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ఆ శిబిరంపై దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.550 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్సై శ్రావణ్కుమార్ తెలిపారు.

‘మా స్థలాన్ని రక్షించండి’

కరకగూడెం: కూలి చేసుకుని బతికే మా భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని కరకగూడెం చర్చి బజార్కు చెందిన బిలపాటి అబ్బయ్య–మల్లమ్మ దంపతులు ఆరోపించారు. ఈ మేరకు వారు శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కరకగూడెం చర్చి బజారులో తమకు 19 గుంటల ఇంటి స్థలం ఉందని, ఆ స్థలంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొంతమంది సహాయంతో శుక్రవారం గుడిసెలు వేశారని వాపోయారు. వృద్ధ దంపతులైన తమపై ఇష్టానుసారంగా వ్యవహరించారని కన్నీంటి పర్యంతమయ్యారు. ఈ సంఘటనపై ఇరువురు స్థానిక పోలీసు స్టేషన్లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకుల అండతోనే కొంతమంది ఇంటి స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం నరేంద్ర, కార్యదర్శి పలకాల నర్సింహారావు, ఉపాధ్యక్షుడు శేఖర్, లీగల్ అడ్వయిజర్ సతీష్ పాల్గొన్నారు.

ఆడపిల్లలను బతకనిద్దాం..

అశ్వాపురం: ఆడపిల్లలను బతకనిద్దాం.. చదవనిద్దాం అని బూర్గంపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ప్రమీల అన్నారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం బాలికల అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ప్రమీల మాట్లాడుతూ.. బేటీ బచావో.. బేటీ పడాఓ నినాదంతో ఆడపిల్లల పురిటిలోనే చంపకుండా బతికించి ఉన్నత చదువులు చదవించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రేమ్సాగర్, అంగన్వాడీ టీచర్లు రెడ్డి అరుణ, హంసవేణి, సాహితి, శైలజ, రావమ్మ, లత, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు వేళాయె..

- ఫిబ్రవరి 6 నుంచి 14 వరకు నిర్వహణ
- ప్రతి రోజూ రాత్రుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు
- జాతర కొనసాగే 9 రోజులూ అన్నదానం
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు

SUNDAY SPECIAL


జాతరలో కొనసాగుతున్న ఊరేగింపు.. (ఫైల్)

దుమ్ముగూడెం: కోరిన కోర్కెలు తీర్చే గ్రామదేవత, అమ్మలు గన్న అమ్మ, మూలపుటమ్మ అమ్మవారు.. బ్రిటీష్ కాలం నుంచి తరతరాలచే పూజలందుకుంటూ పేరు ప్రఖ్యాతలు గాంచిన దుమ్ముగూడెంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతరకు వేళయింది. ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 14 వరకు అంగరంగవైభవంగా ముత్యాలమ్మ అమ్మవారి జాతరను నిర్వహించడానికి ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి వచ్చే ఈ జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి ఏర్పాట్లను చేస్తున్నారు. 1978 నుంచి జాతరగా ఆనవాయితీగా మారి, జాతర కమిటీ ఏర్పడిన తరువాత 22వ జాతర (పండుగ) మహోత్సవానికి ముస్తాబవుతుంది. ప్రతి ఏడాది గ్రామదేవత ఉత్సవాన్ని 9 రోజుల పాటు వైభవోపేతంగా జరపటం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి రోజు సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించటం ఈ జాతర ప్రత్యేకత. ఇందులో భాగంగా ఆలయానికి రంగులు, పందిళ్లు వేసే పనులను చేపట్టారు. రెండేళ్లకు ఒకసారి జరిగే జాతర సోమవారం ప్రారంభం రోజున ఉదయం 11గంటలకు పొలిమేర కట్టడం, సాయంత్రం అఖండ దీపారాధన, పుట్టమన్ను తీసుకొని వచ్చి ఉత్సవాలను ప్రారంభించనున్నారు. గత ఏడాది కోవిడ్–19 నియమాల దృష్ట్యా గతంలో ప్రతి రోజు నిర్వహించే అన్నదానం కార్యక్రమం నిలిపివేశారు. ఈ ఏడాది ప్రతి జాతరకు ఏర్పాటుచేసినట్టే జాతర 9రోజులు అన్నదానం ఏర్పాటు చేయడానికి కావాల్సిన ఏర్పాట్లను ఆలయ కమిటీ చూస్తున్నారు.

మూడు ఊరేగింపులు..

ముత్యాలమ్మ అమ్మవారి 9 రోజుల జాతరలో భాగంగా 3వ రోజు, 6వ రోజు, 9వ రోజు గ్రామ పురవీధుల్లో గరిగెలతో ఊరేగింపును నిర్వహిస్తారు. ఈ జాతరలో ఊరేగింపు కార్యక్రమాలే ప్రత్యేకత ఊరేగింపులో గ్రామంలోని యువకులు ఆడవారిగా వేషధారణ వేసుకుని అమ్మవారి గరిగెలను తలపై ఉంచుకుని గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి నైవేథ్యాలను స్వీకరిస్తారు. ఊరేగింపునకు ఆలయం నుంచి బయలుదేరే ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించే సమయంలో ఆలయంలోని ధ్వజస్తభంపై ఉన్న గంటలు మోగడం అమ్మవారి నిజరూపానికి దర్శనం. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారికి ప్రత్యేకత ఉంది. దీనిలో భాగంగా అమ్మవారి ఊరేగింపులో ఇంటి ముందుకు వచ్చే గరిగెలకు పూజలు చేసి భక్తులు తమ కోర్కెలను కోరుకుంటారు. ఆఖరి రోజు ఊరేగింపులో కోయ వారి కొమ్ము నృత్యం, బేతాళా సెట్ బృందం, కింగ్కాంగ్, రాక్షసి బొమ్మలు, డప్పువాయిద్యాలతో నిర్వహించే ఊరేగింపు జాతరకు హైలెట్గా నిలుస్తాయి. అలాగే భారీ ఎత్తున నిర్వహించే బాణాసంచా కాల్చడం ఆహుతులను కళ్లు తిప్పుకోకుండా చేస్తాయి.

ఆకట్టుకోనున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో తొమ్మిది రోజుల రాత్రి సమయంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకోనున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మ్యూజికల్ నైట్, చిల్డ్రన్స్ డాన్స్బేబీడాన్స్, అంధుల మ్యూజికల్ ఆర్కెస్ట్రా నిర్వహిస్తుంటారు. 2019లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హైపర్ ఆది, బుల్లెట్ భాస్కర్, సింగర్ ధనుంజయ్ పాల్గొని ఆహుతులను అలరించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది యూట్యూబ్ సంచలనం పల్సర్ బైక్ సింగర్ రమణ, పల్సర్ బైక్ సాంగ్ డాన్సర్ కండక్టర్ ఝాన్సీలు తమ టీంలతో జాతరలో పాల్గొంటారు.

అన్నదానానికి ముందుకొస్తున్న దాతలు..

ముత్యాలమ్మ అమ్మవారి జాతర తొమ్మిది రోజులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో ఆలయ కమిటీ ఏర్పాటు చేస్తుంది. కరోనా సమయంలో తప్పా ప్రతి జాతరకూ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. దాతలు అమ్మవారి జాతరలో అన్నదానం చేయడానికి విరివిగా ముందుకు వచ్చి చేయూతనందిస్తుంటారు. ప్రతి రోజూ వేల సంఖ్యలో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ ఎటువంటి అవాంతరాలు జరుగకుండా చేపట్టడం అమ్మవారి ప్రతి రూపానికి నిదర్శనం.

జాతరను విజయవంతం చేస్తాం..



మండలంలో జరిగే అతిపెద్ద ముత్యాలమ్మ జాతరను మండల ప్రజల సహకారంతో, దాతలు, అధికారుల సహకారంతో విజయవంతం చేయడానికి ఆలయ కమిటీ అహర్నిషలూ కృషి చేస్తోంది. జాతర జరిగే తొమ్మిది రోజులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు జరుగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. అమ్మవారి 22వ జాతరను అందరం కలిసి దిగ్విజయంగా విజయవంతం చేయడానికి అందరి సహకారం కావాలి.

– చుక్కా గణేష్రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్


జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు (ఫైల్)

ఓటు విలువ తెలుసుకోవాలి


వ్యాస రచన పోటీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్

భద్రాచలంటౌన్: విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలని భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా శనివారం డివిజన్ స్థాయిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోటీలను పరిశీలించి మాట్లాడారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భద్రయ్య, అధ్యాపకులు ఎండి.కుర్షిద్ మహ్మద్, వరరాజు, పవన్ కుమార్, లతీఫ్, శ్రీనివాస్, పోచాలరావు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించగా.. వాటిలో రేగుబల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. లక్ష్మీనగరం గ్రామంలోని రేగుబల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు జెస్సికా, అంకితలు క్విజ్, వ్యాసరచన పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానం సాధించారు. రేపు జిల్లా స్థాయిలో జరిగే వ్యాసరచన పోటీల్లో వీరు పాల్గొంటారు. తహసీల్దార్ చంద్రశేఖర్, యంఈఓ సున్నం సమ్మయ్య, హెచ్యం ధనసరి నాగమణి, ఎంఆర్జే ప్రభాకర్, ఉపాధ్యాయురాలు జయమ్మలు విద్యార్థినులను అభినందించారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించాలని వినతి

బూర్గంపాడు: గోదావరి వరద ముంపు బాధితులకు మెరక ప్రాంతాలలో ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావుకు వినతిపత్రం అందించారు. ఇళ్ల స్థలాల కోసం క్రాస్రోడ్లో ఐదునెలలుగా నిరాహారదీక్షలు చేస్తున్న వరద బాధితులతో కలసి శనివారం ప్రభుత్వ విప్ కాంతారావుకు వినతిపత్రం అందించి తమగోడును వెళ్లబోసుకున్నారు. ప్రభుత్వపరంగా వరద బాధితులకు తగు న్యాయం చేస్తామని ప్రభుత్వ విప్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పెద్దగోని ఆదిలక్ష్మి, సున్నం భూలక్ష్మి, బండ్ల మునెమ్మ, గజ్జల అలివేలు, ప్రశాంత్, ముత్యాల సత్యనారాయణ, గలిగే నర్సమ్మ, ఇర్పా లక్ష్మి, బట్టు లక్ష్మి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశం

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా పీవీకాలనీలోని సీఈఆర్క్లబ్లోని శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల నిర్వాహణ సన్నాహక సమావేశం శనివారం జీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం జి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఫిబ్రవరి 23 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఏరియా అధికారులు, ఆలయకమిటీ సభ్యులు, కార్మికసంఘాల నేతలకు సూచించారు. కార్మికులు, కార్మిక సంఘాల నేతలు విరాళాల రూపంలో నిధులు సేకరించాలని కార్మిక సంఘాల నేతలను కోరారు. సింగరేణీయులు, వారి కుటుంబసభ్యులు, పట్టణ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్కుమార్, ప్రాజెక్టు ఆఫీసర్స్ నాగేశ్వరరావు, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసాచారి, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, డాక్టర్ శేషగిరిరావు, కార్మికసంఘాల నాయకులు టీబీజీకేఎస్ వీరభద్రం, కాపాశివరాజి, ఏఐటీయూసీ నాగరాజు, సీఐటీయూ వెంకటరత్నం, ఈశ్వరరావు, బీఎంఎస్ రవిందర్రావు, కిషన్రావు, ఇప్టూ నాజర్పాషాలు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరించిన జీఎం

మణుగూరురూరల్: మణుగూరు ఏరియా సింగరేణి ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం–2023 క్యాలెండర్ను ఏరియా జీఎం జి.వెంకటేశ్వరరెడ్డి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం గిరిజనుల సంక్షేమం కోసం 665 బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేసి చరిత్ర సృష్టించిందన్నారు. ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులకు, యాజమాన్యానికి వారధిగా ప్రతి ఏరియాకు లైజన్ ఆఫీసర్ను నియమించిందన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటు జీఎం డి.లలిత్కుమార్, డీజీఎం(పి) రమేష్, సింగరేణి ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు(ఏజీఎం సివిల్), అధ్యక్షుడు ఎం.రాముడు, ఏరియా లైజన్ అధికారి సతీష్కుమార్, ప్రధాన కార్యదర్శి బుద్ద వెంకటేశ్వర్లు, బి జగన్ నాయక్, తుకారాం, రాందాస్, శంకర్, వి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం వెంకటేశ్వరరెడ్డి

మన ఊరు–మనబడి పనుల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి: మండలంలో చేపట్టిన మన ఊరు–మన బడి పనులను మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ శనివారం పరిశీలించారు. మండల కేంద్రంలోని అన్నదైవం పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మన ఊరు–మన బడి కార్యక్రమంతో ప్రభుత్వం పాఠశాలల్లో సకల సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఆయన వెంట విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

31 నుంచి మారాయిగూడెం జాతర

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సమ్మక్క–సారాలమ్మ చిన్న జాతరను ఈ నెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహిచనున్నట్టు దేవర బాలలు సోడి శాంతమ్మ, అచ్చమ్మలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.గిరిజనుల ఇలవేల్పులు శ్రీ సమ్మక్క–సారాలమ్మ చిన్నజాతర మహోత్సవములో 31వ తేదీన మండమేలుగుట జాతర ప్రారంభోత్సవం, 1వ తేదీ సారలమ్మ గద్దెలు శుద్దిచేసి దర్శనం, 2వ తేదీ సమ్మక్క గద్దెలు శుద్ది చేసి దర్శనం, 3వ తేదీ సమ్మక్క–సారలమ్మలకు మొక్కుబడులు చెల్లించుకోనున్నట్లు తెలిపారు.

జీరో సర్వీస్ అవకాశం ఇవ్వాలి

చండ్రుగొండ: 317 జీఓ ఉపాధ్యాయులకు బదిలీల్లో జీరో సర్వీస్ అవకాశం కల్పించాలని ఉపాధ్యాయ సంఘం తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారావత్ సురేష్, బోడా కృష్ణ శనివారం ఓ సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడేళ్లలోపు సర్వీస్ ఉన్న వారికి బదిలీల నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. బదిలీలు, పదోన్నతుల్లో ఎలాంటి పైరవీలకు అవకాశం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

రుణమాఫీ అమలు చేయాలి

బూర్గంపాడు: నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పంటల రుణమాఫీ చేయకుండా రైతులను ఇబ్బందులు పెడుతోందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ ఆరోపించారు. శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయకుండా ప్రభుత్వం రైతుల నెత్తిన వడ్డీభారం మోపుతోందని తెలిపారు. రుణమాఫీ అమలు చేయకుండా బీఆర్ఎస్కు రైతుల ఓట్లు అడిగే హక్కు లేదని, తక్షణమే అమలు చేయాలని డిమాండ్ అన్నారు.

‘ప్రభుత్వ జోక్యం మితిమీరుతోంది..’


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య

మణుగూరుటౌన్: సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వ జోక్యం మితిమీరిపోతోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం మణుగూరు ఏరియాలోని వివిధ గనుల్లో కార్మికులను కలిసి మాట్లాడారు. సింగరేణికి ప్రభుత్వం నుంచి దాదాపు రూ.25వేల కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. కేంద్రం దేశంలోని బొగ్గుగనులను హోల్సేల్గా మెస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం రిటైల్గా కాంట్రాక్టికరణ చేస్తోందన్నారు. గోదావరి వరదలకు రూ.1000 కోట్లు, మెడికల్ కళాశాలలకు రూ.500ల కోట్ల సింగరేణి నిధులు రాష్ట్ర ప్రభుత్వం తరలించిందన్నారు. సింగరేణి ఆస్పత్రిల్లో డిజిటల్ ఎక్స్రే మిషన్కు డబ్బులేదని చెప్పే యాజమాన్యం.. ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు వేల కోట్లు డబ్బులు కేటాయించడం దారుణం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి కార్మికుడికి రెండు గుంటల నివాస స్థలం, సొంత ఇంటి కోసం రూ.10లక్షల వడ్డీలేని రుణం చెల్లించాలన్నారు. లేని పక్షంలో కార్మికుల నివాసం ఉండే క్వార్టర్స్ను నామినల్ ధరలకు కార్మికులకు కేటాయించాలన్నారు. గుర్తింపు కార్మిక సంఘం కాల పరిమితి ముగిసినా ఎన్నికలు నిర్వహించలేదన్నారు. సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలని ఆర్ఎల్సీ కార్యాలయాన్ని ఫిబ్రవరి 1న ముట్టడి చేయనున్నట్లు తెలిపారు. అరబిందో కంపెనీకి కోయగూడెం బ్లాక్ త్రీని కట్టబెట్టడానికి నిరసనగా ఫిబ్రవరి 17న ముట్టడి కార్యక్రమాలు నిర్వహించడానికి ఏఐటీయూసీ నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జనరల్ సెక్రటరీ మిరియాల రంగయ్య, చీఫ్ అడ్వయిజర్ డి.శేషయ్య, బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్, వి.రామనర్సయ్య, సుభానీ, మేకల ఈశ్వర్, ఆవుల నాగరాజు, మల్లేష్, సుధాకర్, శ్రీనివాస్, పాపారావు, నరహరి, కృష్ణమూర్తి, పాషా, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పౌష్టికాహారం

భద్రాచలంఅర్బన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం, అదనపు జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీస్ వారి ఆధ్వర్యంలో క్షయ వ్యాధితో బాధపడుతున్న 75 మంది బాధితులకు శనివారం పౌష్టికాహార సామగ్రి అందించారు. రాష్ట్ర ఐఆర్సీఎస్ అధ్యక్షుడు, గౌవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ సూచనల మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు రెడ్ క్రాస్ జిల్లా బాధ్యుడు డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ పాల్గొని పౌష్టికాహార కిట్లను బాధితులకు అందించారు. రెడ్ క్రాస్ సభ్యులను అభినందించారు. అనంతరం డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ జి.శ్రీనివాస్లు మాట్లాడుతూ.. ఆరు నెలలు సక్రమంగా మందులు వాడటంతో పాటు మంచి పౌష్టికాహారం తీసుకుంటే టీబీ నుంచి త్వరగా కోలుకోవచ్చని తెలిపారు. కార్యక్రమానికి లయన్ పి.దేశప్ప, బొల్లి సూరిబాబు సహకారం అందించగా లయన్ వై.సూర్యనారాయణ, టి.సిద్ధులు, జి.రాజారెడ్డి, లయన్ పూర్ణచంద్రరావు, జి.శంకర్రావు, భూపతిరావు, డి.శ్రీనివాసరాజు, సిద్దారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

కరెంటు స్తంభం ఏర్పాటు


కొత్త స్తంభం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పినపాక: మండలంలోని ఈ బయ్యారం గ్రామంలో రైస్ మిల్లు ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం మధ్యకు విరిగి ప్రమాదంగా ఉందని సాక్షిలో ప్రచురితమైన కథనంపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం మరమ్మతులు చేపట్టి విరిగిన కరెంటు స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. అధికారులు వెంటనే స్పందించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఒప్పందాన్ని అమలు చేయించండి

మణుగూరురూరల్: సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలతో చేసుకున్న ఆపరేటర్ల సూటబుల్ జాబ్ ఒప్పందాన్ని అమలు చేయించాలని ఏరియా ఆపరేటర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్యకు ఆపరేటర్లు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆపరేటర్లు ఎస్డి.నాసర్పాషా, మేకల ఈశ్వర్, జానకిప్రసాద్, మల్లేష్, రాములు, పాపారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి వైద్యం చేయొద్దు

అన్నపురెడ్డిపల్లి: ఆర్ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేయరాదని మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక అన్నారు. మండల కేంద్రంలోని సీతారామ ప్రాథమిక చికిత్స కేంద్రంలో ఆర్ఎంపీ పరిమితికి మించి వైద్యం చేస్తున్నారన్న ఫిర్యాదుతో శనివారం క్లినిక్ను ఆమె సందర్శించారు. క్లినిక్ ఓపీ రిజిస్టర్లు, ఆర్ఎంపీ అర్హత సర్టిఫికెట్లను తనిఖీ చేశారు. క్లినిక్కి వచ్చే రోగులకు సదరు ఆర్ఎంపీ ఇంజెక్షన్లు ఇస్తూ, ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కిస్తున్నారని గుర్తించారు. పేషెంట్లను అవసరం ఉన్నా లేకున్నా పెద్ద ఆస్పత్రికి పంపుతున్న రెఫరల్ లెటర్లను స్వాధీనం చేసుకున్నారు. బయో వేస్టేజీని సరైన రీతిలో తొలగించడం లేదని గుర్తించారు. విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేశారు. పరిమితికి మించి వైద్యం చేస్తున్న ఆర్ఎంపీకి త్వరలో షోకాజ్ నోటీసు ఇవ్వనున్నట్లు వైద్యాధికారి తెలిపారు. పరిధి దాటి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై విజయ, డీపీఎంఓ వెంకటేశ్వరరావు, హెచ్ఎస్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టాప్ బోర్డుల ఏర్పాటు



ములకలపల్లిలో స్టాప్ బోర్డులు ఏర్పాటు చేసిన పోలీసులు

ములకలపల్లి: పోలీస్శాఖ ఆధ్వర్యంలో పాల్వంచ–మందలపల్లి ప్రధాన రహదారిపై స్టాప్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ దారిలోని ప్రమాదకర ప్రదేశాలు, మూలమలుపులు, రోడ్లపై గుంతలున్న ప్రాంతాల్లో స్థానిక ఎస్సై బాల్దె సురేశ్ పర్యవేక్షణలో శనివారం వీటిని ఏర్పాటు చేశారు. అదేవిధంగా రోడ్డుకు ఇరువైపులా ఎండిపోయి ప్రమాదకరంగా మారిన చెట్లను తొలగించారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా రహదారి



మణుగూరు మండలంలోని ఇసుక బంకర్ సమీపంలోని మణుగూరు- ఏటూరినాగారం ప్రధాన రహదారి పూర్తిగా పాడైపోయింది. రోడ్డు పగిలి గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో లారీలు, ఇతర వాహనాలు నడుస్తూ ఉంటాయి. అదే విధంగా నిత్యం బీటీపీఎస్ బొగ్గు లారీలు సైతం వందల్లో నడుస్తున్నాయి. ఈ ప్రాంతంలోనే అనేక ప్రమాదాలు జరిగిన సంఘటనలూ ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ గుంతలు పూడ్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. - మణుగూరుటౌన్

ప్రశ్నించాల్సిన అధికారి: హిరాలాల్, ఆర్అండ్బీ డీఈ
ఫోన్ నంబర్: 9440818414

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 80742 70476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు జి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎ. దుర్గాప్రసాద్ - 79979 58226 | టోల్ ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమన శుభాకాంక్షలు అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416